పంచాయతీ కార్యదర్శుల సస్పెన్షన్

కోటపల్లి: మండలంలోని ఎసన్‌వాయి, సిర్సా గ్రామ పంచాయతీల కార్యదర్శులు తాజొద్దీన్, నరిగమల సదయ్యలను సస్పెండ్ చేసినట్లు జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. పంచాయతీల్లో పారిశుధ్య లోపం, అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం, డంపింగ్‌యార్డు నిర్వహణ సక్రమంగా లేకపోవడం, పన్నుల వసూళ్లలో నిర్లక్ష్యంగా వ్యవహరించారని పేర్కొన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సస్పెండ్ చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

రంజాన్ వేళలు

మంగళ
ఇఫ్తార్
6:33

బుధ
సహర్
4:40

వాతావరణం

గరిష్టం/కనిష్టం
38.0 /24.0

ఆకాశం ఉదయం వేళ ప్రకాశవంతంగా, రాత్రి వేళ మేఘావృతమై ఉంటుంది. ఉక్కపోతగా ఉంటుంది. వడగాలులు వీస్తాయి. ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి.

న్యూస్‌రీల్

అధిక చార్జీలపై చర్యలు

- అంబులెన్స్ డ్రైవర్లకు ఇంచార్జీ డీటీవో హెచ్చరిక
- అంబులెన్స్ అసోసియేషన్‌తో అత్యవసర సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఇంచార్జీ డీటీవో

సాక్షి ఎఫెక్ట్..

మంచిర్యాలరూరల్(హాజీపూర్): అంబులెన్స్ డ్రైవర్లు అడ్డగోలుగా రోగుల నుంచి డబ్బులు వసూలు చేయాలని చూస్తే వాహనాలు సీజ్ చేస్తామని జిల్లా ఇంచార్జీ డీటీవో సంతోష్‌కుమార్ హెచ్చరించారు. పోలీసు, రవాణా శాఖ నిర్ణయించిన ధరలు మాత్రమే రోగులకు అందుబాటులో ఉండాలని సూచించారు. 'కాసుల కక్కుర్తి' శీర్షికన ఈ నెల 7న 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి రవాణా శాఖ అధికారులు స్పందించారు. సోమవారం హాజీపూర్ మండలం వేంపల్లిలోని జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో మంచిర్యాల ప్రైవేటు అంబులెన్స్ అసోసియేషన్ సభ్యులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంచార్జీ డీటీవో మాట్లాడుతూ అంబులెన్స్ నిర్వాహకులు ఇటీవల పలు వివాదాలకు కారణమవుతున్నారని, రెండ్రోజుల క్రితం ఓ రోగి మృతిచెందడానికి బాధ్యులు కావడం విచాకరమని అన్నారు. ఫిట్‌నెస్, ఇన్సూరెన్స్, డ్రైవర్లకు లైసెన్స్ విధిగా ఉండాలని, అంబులెన్స్‌ల్లో రోగులకు అవసరమైన మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎంవీఐ కిషోర్ చంద్రరెడ్డి, అంబులెన్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు



పాల్గొన్న ఈశ్వర్, సుమన్, దివాకర్‌రావు

శ్రీరాంపూర్: నస్పూర్‌లోని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో సోమవారం ముస్లింలకు ఇఫ్తారు విందు ఇచ్చారు. మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో పెద్దపల్లి బీఆర్‌ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, పార్టీ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్ పాల్గొన్నారు. రంజాన్ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని నేతలు సూచించారు. పార్టీ నస్పూర్ పట్టణ అధ్యక్షుడు అక్కూరి సుబ్బయ్య, నాయకులు పవన్‌కుమార్, పానుగంటి సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రోధి.. 'కొత్త' ఆశల ఉగాది



మంచిర్యాల మార్కెట్‌లో మామిడికాయలు, కొత్త చింతపండు అమ్మకాలు

మంచిర్యాలటౌన్: శోభకృత్ నామ సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ క్రోధి నామ సంవత్సరం వచ్చేసింది. తెలుగు వారికి కొత్త సంవత్సరం ఉగాది పర్వదినంతోనే ప్రారంభమవుతుంది. తెలుగు పంచాంగం ప్రకారం మంగళవారం ఉగాది పండుగను షడ్రుచులతో ఆనందోత్సహాల మధ్య నిర్వహించుకునేందుకు జిల్లా ప్రజలు సిద్ధమయ్యారు. షడ్రుచులతో చేసిన పచ్చడిని తప్పనిసరిగా తింటారు. ఇందుకోసం అవసరమైన మామిడికాయలు, బెల్లం, ఉప్పు, కారంపొడి, చింతపండు, వేప పూలు కొనుగోలు చేసేందుకు ప్రజలు మంచిర్యాలలోని మార్కెట్‌కు తరలిరావడంతో సందడి నెలకొంది. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో సోమవారం మహమ్మాయి అమ్మవారి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. విశ్వబ్రాహ్మణులు, విశ్వకర్మలు ఈ ఉత్సవాలను ప్రతియేటా ఉగాది పండుగకు ముందు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. మూడు రోజులపాటు తమ పనిముట్లను పూజిస్తారు. ఆలయాల్లో పంచాంగ పఠనానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి.



గుంటకో లెక్క !

- ఎకరాల్లో కొని గుంటలకొద్దీ అమ్మకాలు
- ఫాం ల్యాండ్స్, రిసార్ట్స్‌తో 'రియల్' దందా
- వాణిజ్య మొక్కలు పెంచుతామని ఆకర్షణ
- స్థానిక సంస్థల ఆదాయానికి భారీ గండి



మందమర్రి మండలం వెంకటాపూర్ శివారులో ఏర్పాటు చేసిన ఫాం ల్యాండ్

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: జిల్లాలో ఫాం ల్యాండ్స్, రిసార్ట్స్ దందా మళ్లీ జోరందుకుంటోంది. రైతుల నుంచి సాగుభూములను కొనుగోలు చేసి కాస్త మార్చేసి ఫాం ల్యాండ్స్‌గా పేరు మార్చుతూ కొందరు వ్యాపారులు విక్రయిస్తున్నారు. ఎకరాల కొద్దీ వెంచర్లు వేస్తూ మళ్లీ గుంటల్లో అమ్మేస్తున్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయాల్లో 'ధరణి' పోర్టల్‌లో స్లాట్ బుక్ చేసుకుంటూ రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. సాగు భూములను తహసీల్దార్ కార్యాలయాల్లో, సాగేతర భూములను స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ పరిధి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ చేయాలి. సాగు భూముల్లోనే శ్రీగంధం, ఎర్రచందనం తదితర వాణిజ్య మొక్కలు పెంపకం, నిర్వహణ అని చెబుతూ అమ్మకాలు సాగిస్తున్నారు. మధ్య తరగతి ప్రజలను అనేక రకాలుగా ప్రలోభాలకు గురి చేస్తూ ఈ ప్లాట్ల విక్రయాలు చేస్తున్నారు. జైపూర్, మందమర్రి, కాసిపేట, బెల్లంపల్లి, నెన్నెల మండలాల్లో ఫాం ల్యాండ్స్ పేరుతో అధికంగా వ్యాపారం జరుగుతున్నాయి. జైపూర్ మండలంలో పుట్టగొడుగుల్లా ఫాంల్యాండ్స్ వెంచర్లు వెలుస్తున్నాయి. ఇక్కడి తహసీల్దార్ కార్యాలయంలో ప్రతీరోజు గుంటల్లో రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. మందమర్రి, జైపూర్ థర్మల్ పవర్ ప్లాంటు సమీప గ్రామాల్లో ఫాం ల్యాండ్స్, రిస్టార్ట్స్ పేరుతో వెంచర్లు వెలుస్తున్నాయి.

రైతుబంధు, బీమా యథాతథం

'ధరణి'లో నిర్ణీత భూ విస్తీర్ణానికే రిజిస్ట్రేషన్లు చేయాలనే నిబంధనలేవీ లేవు. కానీ పట్టణ ప్రాంతాలు నీటికుంటలు, చెరువులు, వాగులు, నదీతీర ప్రాంతాల పరిధిలో 20గుంటల కంటే తక్కువగా సాగు భూములను రిజిస్ట్రేషన్ చేయొద్దు. మరోవైపు రిసార్ట్స్, వనాలు, వాణిజ్య మొక్కల పెంపకం కోసం కచ్చితంగా నాలా(నాన్ అగ్రికల్చర్ ల్యాండ్ అసెస్మెంట్)గా మార్చాలి. చాలాచోట్ల వ్యవసాయ భూములుగానే అమ్మేస్తున్నారు. దీంతో గుంట నుంచే పట్టా చేస్తూ రైతుబంధు, బీమా సైతం వర్తించేలా చేసుకుంటున్నారు. జిల్లా కేంద్రానికి 20 నుంచి 30కిలోమీటర్లు, జాతీయ రహదారులు, గ్రామీణ, మండల, పట్టణ ప్రాంతాలకు సమీప ప్రాంతాల్లో రిసార్టులు ఏర్పాటు చేస్తున్నారు. గత కొన్ని రోజులుగా జిల్లాలో వాణిజ్య మొక్కలను నాటి, వనాల పెంపకం చేపట్టి నేరుగా ప్లాట్లు చేస్తూ అమ్మేస్తున్నారు. కొన్ని చోట్ల అసైన్డ్, లావణి పట్టా భూముల్లోనూ అమ్మకాలు సాగిస్తున్నారు.

ఆదాయానికి గండి

లే అవుట్ అనుమతులు స్థానిక సంస్థల నుంచి పొందాల్సి ఉంటుంది. ఫాంల్యాండ్స్‌ల్లో ఇలాంటివేవి లేకుండానే తహసీల్దార్ కార్యాలయాల్లో స్లాట్ బుక్ చేసుకుని అమ్మకాలు చేస్తున్నారు. కొన్ని చోట్ల 'నాలా'గా మార్చినప్పటికీ 'లే అవుట్' అనుమతులు పొందడం లేదు. డీటీసీపీ లేకుండానే, రోడ్లు, నివాస యోగ్యానికి అన్ని సౌకర్యాలు కల్పిస్తామంటూ ప్రచారం చేస్తున్నారు. ఇందుకు ఏజెంట్లకు ప్లాట్ల వారీగా కమీషన్లు ఇస్తూ ఆకర్షిస్తున్నారు. దీంతో స్థానిక సంస్థల ఆదాయానికి భారీగా గండి పడుతోంది. ధరణిలో రిజిస్ట్రేషన్లతో వచ్చే ఫీజులు సర్కారు ఖజానాకు వెళ్తున్నాయి.

మా దృష్టికి వచ్చింది..



ఫాం ల్యాండ్స్, రిసార్ట్స్ పేరుతో సాగు భూములను గుంటల కొద్దీ రిజిస్ట్రేషన్లు చేస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. గ్రామీణ ప్రాంతాల్లో 'ధరణి' పోర్టల్‌లో నిర్దిష్ట విస్తీర్ణం నుంచే రిజిస్ట్రేషన్లు చేయాలని స్పష్టత లేకపోవడంతో, సీసీఎల్‌ఏకు నివేదించాం. పట్టణ పరిధిలో గుంటల్లో చేస్తే మాత్రం చర్యలు తీసుకుంటాం.

– ఎస్.మోతీలాల్,
జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ)

ధాన్యం కొనుగోళ్లపై కంట్రోల్ రూమ్ ఏర్పాటు

మంచిర్యాలఅగ్రికల్చర్: యాసంగి ధాన్యం కొనుగోలుకు రైతుల సౌకర్యార్థం సమీకృత కలెక్టరేట్ పౌరసరఫరాల శాఖ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్ ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకుల ఫిర్యాదులను రిజిష్టర్‌లో నమోదు చేస్తారని తెలిపారు. ఉదయం 8గంటల నుంచి రాత్రి 9గంటలకు అందుబాటులో ఉంటుందని, వివరాలకు 6303928682 నంబరులో సంప్రదించాలని తెలిపారు.

బీజేపీ ఎన్నికల ప్రచారం



నంబాలలో పార్టీ కార్యకర్తలతో నినాదాలు

దండేపల్లి/బెల్లంపల్లి: దండేపల్లి మండలం గూడెం, రాసపల్లి, నంబాల గ్రామాల్లో బీజేపీ పెద్దపల్లి లోక్‌సభ అభ్యర్థి గోమాసే శ్రీనివాస్ సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కరపత్రాలు పంపిణీ చేస్తూ బీజేపీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం నిధులతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని తెలిపారు. బెల్లంపల్లి మున్సిపాలిటీలో బీజేపీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శి పట్టి వెంకటకృష్ణ, అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ రాచర్ల సంతోష్, పట్టణ అధ్యక్షురాలు దార కళ్యాణి పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

- బీఆర్‌ఎస్‌తోనే కార్మికులకు హక్కులు
- పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్

పాతమంచిర్యాల/శ్రీరాంపూర్/దండేపల్లి: కాంగ్రెస్ పార్టీ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చాలని బీఆర్‌ఎస్ పార్టీ పెద్దపల్లి లోక్‌సభ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ అన్నారు. సోమవారం ఆయన మంచిర్యాల పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు నివాసంలో విలేకరులతో మాట్లాడారు. శ్రీరాంపూర్‌లోని ఎస్‌ఆర్పీ 1, ఎస్‌ఆర్పీ 3 గనులలో కార్మికులను కలిసి మాట్లాడారు. దండేపల్లి, మేదరిపేటలో గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. లోక్‌సభ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలని అభ్యర్థించారు. కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. పంటల మద్దతు ధరపై రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించి నేటికీ దాని ఊసే లేదన్నారు. సింగరేణి కార్మికులకు బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే కొత్త హక్కులు, సదుపాయాలు కల్పించామని తెలిపారు. ఎంపీగా గెలిపిస్తే కార్మికుల కార్మికుల ఆదాయపన్ను సమస్యను కేంద్రం దృష్టికి తీసుకెళ్తానని అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్ మాట్లాడుతూ రైతు భరోసా కింద రైతులకు ఇవ్వాల్సిన రూ.12 వేలు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఫోన్ ట్యాపింగ్‌పై పదే పదే మాట్లాడుతున్నారని, తనకు దమ్ము, ధైర్యం ఉంటే సరైన ఆధారాలతో బయట పెట్టాలని డిమాండ్ చేశారు. ప్రజల దృష్టిని మళ్లించడానికే చౌకబారు ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. శ్రీరాంపూర్ బస్టాండ్ వద్ద కార్మికుని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు, బీఆర్‌ఎస్ నాయకుడు విజిత్‌రావు, గాదే సత్యం, రాజా రమేష్, టీబీజీకేఎస్ బ్రాంచ్ ఇంచార్జి పెట్టం లక్ష్మణ్, మాజీ ప్రధాన కార్యదర్శి పెద్దపల్లి కోటిలింగం పాల్గొన్నారు.

ఐబీ స్థలంలో ఎంసీహెచ్ నిర్మాణానికి పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల ఐబీ స్థలంలో మాతాశిశు ఆస్పత్రి(ఎంసీహెచ్) నిర్మాణానికి సోమవారం ఎస్ఎస్ఐపీసీపీఎల్ సీనియర్ ఇంజినీర్ విద్యాసాగర్ ఆధ్వర్యంలో అధికారుల బృందం ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావుతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. గోదావరి తీరాన ఉన్న ఎంసీహెచ్ వర్షాకాలంలో మునిగిపోతుండడంతో ఐబీ స్థలంలో నిర్మాణానికి ఎమ్మెల్యే సంకల్పించారు. సకల సౌకర్యాలతో ఆస్పత్రి భవనం నిర్మించాలని అధికారులను సూచించారు. ఆర్డీవో కార్యాలయం, ఆర్ అండ్‌బీ భవనాలు, విశ్రాంత భవనం మరోచోటుకు తరలించి ఆ భవనాలను ఆస్పత్రి నిర్మాణానికి స్వాధీనం చేసుకోవాలని అన్నారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణాన్ని కూల్చివేసి ఆ స్థలంలో మాతాశిశు ఆస్పత్రి నిర్మాణానికి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని, బాలింతలు, గర్భిణుల సమస్యకు తెరపడనుందని తెలిపారు.

నీటి కొరత లేకుండా చూడాలి

కోటపల్లి: గ్రామాల్లో నీటి కొరత లేకుండా చూడాలని జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ అధికారులను ఆదేశించారు. సోమవారం మండలంలోని ఎదులబంధం గ్రామ పంచాయతీని సందర్శించారు. గ్రామస్తులతో మట్లాడి నీటి సమస్యపై ఆరా తీశారు. మిషన్ భగీరథ నీరు పంపిణీలో ఆటంకం లేకుండా చూడాలని, బోర్లు మరమ్మతు చేయించాలని తెలిపారు. పారిశుధ్య నివారణ చర్యలు ప్రతీరోజు చేపట్టాలని తెలిపారు. ఆయన వెంట ఎంపీడీవో అకుల భూమన్న, మిషన్ భగీరథ ఏఈ వివేక్, కార్యదర్శి సమ్మయ్య ఉన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు



గాయపడిన తైదల నరేందర్


గాయపడిన బాబర్‌ఖాన్

భీమారం(చెన్నూర్): మంచిర్యాల–చెన్నూర్ జాతీయ రహదారిపై భీమారం సమీపంలోని పెట్రోల్ పంప్ వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలైనట్లు ఎస్సై రాములు తెలిపారు. మండల కోఆప్షన్ మెంబర్ బాబర్ ఖాన్, మరో వ్యక్తి తైదల నరేందర్‌తో కలిసి నడుచుకుంటూ ఇంటికి వెళ్తుండగా మంచిర్యాల వైపు నుంచి మహారాష్ట్రవైపు వెళ్తున్న వ్యాన్ వెనుకనుంచి వచ్చి ఢీకొట్టింది. ఇద్దరికి తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు మంచిర్యాల ఆస్పత్రికి తరలించారు. డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

తేనెటీగల దాడిలో పలువురికి గాయాలు

బెల్లంపల్లిరూరల్: కన్నాల గ్రామ పంచాయతీ పరిధిలోని శ్రీ బుగ్గ రాజేశ్వర స్వామి ఆలయ ఆవరణలో సోమవారం తేనెటీగలు పలువురిపై దాడి చేశాయి. ఆలయ ఆవరణలో హనుమాన్ మాలదారులు వంట చేసే క్రమంలో పొగ వ్యాపించడంతో సమీపంలోని చెట్లపైన ఉన్న తేనెటీగలు ఒక్కసారిగా లేచి అక్కడున్న వారిపై దాడి చేశాయి. ఆలయంలో స్వీపర్‌గా పనిచేసే బుగ్గగూడకు చెందిన జి.పోసానికి తీవ్రగాయాలు కావడంతో స్థానిక ఆస్పత్రికి తరలించారు.



షడ్రుచుల ఉగాది

- క్రోధి నామ సంవత్సరానికి స్వాగతం
- పలు ఆలయాల్లో పంచాంగ పఠనానికి ఏర్పాట్లు

మంచిర్యాలఅర్బన్: చైత్రశుద్ధ పాడ్యమి నాడు వచ్చే తెలుగువారి మొట్టమొదటి పండుగ ఉగాది. తెలుగు వారికి కొత్త సంవత్సరం ఉగాది పర్వదినంతోనే ప్రారంభమవుతుంది. తెలుగు పంచాగం ప్రకారం ఈ ఏడాది ఏప్రిల్ 9న మంగళవారం శ్రీ క్రోధి నామ సంవత్సరం మొదలవుతుంది. క్రోధి అంటే క్రోదమును కలిగించేదని అర్థం. ఉగాది రోజున ఆలయాల్లో పంచాంగ పఠనం ప్రత్యేకంగా నిలుస్తుంది. అర్చకులు, పండితులు రాశుల వారీగా తెలియజేసే ఆదాయ, వ్యయాలు, రాజపూజ్యం, అవమానాలను తెలుసుకునేందుకు ప్రజలు ఆసక్తి కనబరుస్తారు.

షడ్రుచులతో ఉగాది పచ్చడి

ఉగాది పర్వదినాన శిశర ఋతువుకు వీడ్కోలు పలికి వసంత ఋతువుకు స్వాగతం పలుకుతారు. ఈసమయంలోనే చెట్లు చిగురించడం, కోయిల రాగాలు వినిపిస్తాయి. ఉగాది రోజున కుటుంబ సభ్యులంతా వేకువజామునే నిద్రలేచి తలంటు స్నానాలు ఆచరిస్తారు. కొత్తబట్టలు ధరిస్తారు. ఇంటిముందు మామిడాకుల తోరణాలు కడుతారు. అందమైన ముగ్గులు వేసి వసంతలక్ష్మిని స్వాగతిస్తారు. ఉగాది పచ్చడి ఈ పండుగకు ప్రత్యేకం. షడ్రుచుల సమ్మేళనం తీపి (మధురం), పులుపు (ఆమ్లం) ఉప్పు (లవణం), కారం (కటు), చేదు (తిక్త) వగరు (కషాయం) అనే ఆరు రుచులు కలిసిన ఉగాది పచ్చడి తెలుగువారికి ప్రత్యేకం. ఏడాది పొడవునా ఎదురయ్యే మంచి చెడులను కష్టసుఖాలను సంయనంతో స్వీకరించాలన్న సందేశాన్ని ఉగాది పచ్చడి తెలియజేస్తుంది. పచ్చడి కోసం మామిడి కాయలు, వేపపువ్వు, చింతపండు, కొబ్బరి, బెల్లం వాడుతారు. ఉగాది రోజున పంచాంగ శ్రవణం, గోపూజ, ఏరువాక ఆచారాలు పాటిస్తారు.

విశ్వనాథ స్వామి ఆలయంలో...

జిల్లా కేంద్రంలోని విశ్వనాథ స్వామి ఆలయ ప్రాంగణంలో క్రోధి నామ సంవత్సరాన్ని పురస్కరించుకుని బుడి దామోదర్ శర్మ సిద్ధాంతిచే ఆరుగంటలకు పంచాంగ శ్రవణం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

నిరుద్యోగులకు ఆశాజనకం



శ్రీ క్రోధి నామ సంవత్సరంలో నిరుద్యోగులకు ఆశాజనకంగా ఉంటుంది. రాజకీయ అస్థిరతలు, నాయకులలో పరస్పర వ్యతిరేకతలు, వర్షాలు అధికంగా ఉంటాయి. రైతులకు అనుకూలంగా ఉంటుంది. కేంద్రంలో ప్రస్తుత ప్రభుత్వమే కొనసాగే సూచనలు అధికంగా ఉన్నాయి.

– బుడి దామోదర్‌శర్మ, సిద్ధాంతి

సమయస్ఫూర్తి అవసరం



క్రోధి అంటే క్రోధమును కలిగించేది. ఈకాలంలో ప్రజలు కోపం, ఆవేశంతో వ్యవహరించకుండా సమయస్ఫూర్తితో నడుచుకోవాలి. పనిని, సమయాన్ని అనుకూలంగా మలచుకోవాలి. ప్రజలందరూ సుఖజీవనం సాగించాలి.

– భట్టాచార్యులు, విశ్వనాథస్వామి ఆలయ అర్చకుడు

మహమ్మాయి అమ్మవారి ఉత్సవాలు

- మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు

చెన్నూర్‌రూరల్: ఉగాదిని పురస్కరించుకుని గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణాల్లో సోమవారం మహమ్మాయి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఏటా ఉగాదికి ముందురోజు విశ్వబ్రాహ్మణులు, విశ్వకర్మలు ఈ ఉత్సవాలను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. విశ్వబ్రాహ్మణులకు ఉగాది పెద్ద పండుగ. అమావాస్య నుంచి మూడు రోజుల పాటు ఉత్సవాలు జరుపుకుంటారు. అడవిలో లభించే తీగదారి పుష్పాలు, మోదుగపూలు, విష్ణుమూర్తి అవతారంగా పిలువబడే మర్రి ఆకులతో మంటపాన్ని వేసి అందంగా ముస్తాబు చేస్తారు. అందులో అమ్మవారిని ప్రతిష్టించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. పక్కనే పనిముట్లను పక్కనే ఉంచి మూడు రోజులపాటు పూజిస్తారు. చివరి రోజున మంగళహారతులతో ఇంటింటికీ వెళ్లి అమ్మవారికి పూజలు చేసి ఉద్వాసన పలుకుతారు. గాయత్రి మాతను కులదైవంగా పూజించే విశ్వకర్మలు యజ్ఞోపవీతాన్ని(జంధ్యం) పూజించి ఉగాది రోజున కొత్తది ధరిస్తారు.


ఆస్నాదలో పూజలు చేస్తున్న అర్చక దంపతులు

దోపిడీకి పాల్పడిన ఒకరి అరెస్ట్

మంచిర్యాలక్రైం: కిడ్నాప్ చేసి దోపిడీకి పాల్పడిన కేసులో ఒకరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు స్థానిక ఏసీపీ ప్రకాష్ తెలిపారు. సోమవారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. స్థానిక రాంనగర్‌కు చెందిన మల్లేశ్ ఈ నెల 6న లక్సెట్టిపేటకు వెళ్లి తిరుగుప్రయాణంలో రాత్రి 10:30 గంటలకు బైపాస్ వద్ద బస్సు దిగాడు. ఇంటికి వెళ్లేందుకు ఆటో కోసం ఎదురుచూస్తుండగా ఓ ఆటో డ్రైవర్ వచ్చి బాపూ నీ కొడుకు నాకు తెలుసు.. నిన్ను ఇంటివద్ద దించుతానని చెప్పి ఆటో ఎక్కించుకున్నాడు. కొంతదూరం తీసుకెళ్లి కత్తితో బెదిరించాడు. ఆటోలో ఉన్న మరో వ్యక్తి కర్రతో దాడి చేసి అతని వద్ద ఉన్న రూ.4 వేలు తీసుకుని పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా కన్నెపల్లి మండలం తాళ్ల రెబ్బెన గ్రామానికి చెందిన చెన్నూర్ రవిని సోమవారం స్థానిక రైల్వే స్టేషన్‌లో అరెస్ట్ చేశారు. అతనికి సహకరించిన మరో నిందితుడు దారంగుల రాజు పరారీలో ఉన్నాడన్నారు. రవి వద్ద నుంచి ఆటో, కత్తి, రూ.2 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సమావేశంలో సీఐ భన్సీలాల్, ఎస్సైలు మహేందర్, లక్ష్మణ్ పాల్గొన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ ప్రకాష్

క్రికెట్ వీక్షణలో గ'మ్మత్తు'!

- మద్యంతోపాటు మ్యాచ్‌లు చూపిస్తున్న బార్

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ఐపీఎల్ సీజన్‌లో యువతను ఆకర్షించేందుకు ఓ బార్ యజమాని అడ్డదారులు తొక్కుతున్నారు. క్రికెట్ చూసేందుకు ఏసీ హాలు, మద్యం, తినుబండరాలు అందుబాటులో ఉంచుతూ నిబంధనలు తుంగలో తొక్కుతున్నారు. కొద్ది రోజులుగా జాతీయ రహదారిపై ప్రధాన రోడ్డుకు ఆనుకునే నస్పూర్‌లో ఓ బార్ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నా ఆబ్కారీ శాఖకు పట్టడం లేదు. నిబంధనల ప్రకారం బార్ లైసెన్సు పొందిన భవన స్థల పరిధిలోనే మద్యం విక్రయాలు చేపట్టాలి. అయితే నిర్వాహకులు ఐపీఎల్ సీజన్‌ను క్యాష్ చేసుకునేందుకు కింది ఫ్లోర్‌లో బార్‌ఉంటే పైఅంతస్తులో టేబుళ్లు, భారీ ఎల్‌సీడీ తెరలు ఏర్పాటు చేశారు. కింది అంతస్తు నుంచే వారికి మద్యం సరఫరా చేస్తూ వ్యాపారం చేస్తున్నారు. మత్తులో క్రికెట్ చూస్తూ కొందరు బెట్టింగ్‌లు సైతం నిర్వహిస్తున్నారు. నిర్ణీత సమయం దాటాక కూడా బార్ నిర్వహిస్తున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. దీనిపై ఎక్సైజ్ సీఐ గురువయ్యను 'సాక్షి' వివరణ కోరగా తమ సిబ్బందిని పంపించి తనిఖీలు చేస్తామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా టేబుళ్లు ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

పెళ్లి విందులో కత్తిపోట్లు

- పెళ్లి కొడుకుతోపాటు మరో ఐదుగురికి గాయాలు
- మంచిర్యాల ఆస్పత్రికి నలుగురి తరలింపు

చెన్నూర్: పెళ్లి అనంతరం బంధువులు, స్నేహితుల కోసం ఏర్పాటు చేసిన విందులో కత్తిపోట్ల ఘటన కలకలం రేపింది. పెళ్లికొడుకుతోపాటు మరో ఐదుగురు గాయపడ్డారు. వీరిలో నలుగురికి తీవ్ర గాయాలు కావడంతో మంచిర్యాలలోని ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటన ఆదివారం రాత్రి మంచిర్యాల జిల్లా చెన్నూర్ పట్టణంలోని ఎమ్మెల్యే కాలనీలో చోటు చేసుకుంది. జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్‌రావు సోమవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో విలేకరులకు వివరాలు వెల్లడించారు. పట్టణంలోని ఎమ్మెల్యే కాలనీలో నివాసం ఉంటున్న నెన్నల గంగు కుమారుడు నెన్నల కిరణ్‌కు తాండూర్ మండలం అచ్చులపురం గ్రామానికి చెందిన కల్యాణితో ఈ నెల 3న వివాహం జరిగింది. ఆదివారం రాత్రి ఎమ్మెల్యే కాలనీలో విందు ఏర్పాటు చేశారు. గంగు ఇంటి పక్కనే నివాసం ఉంటున్న ఆకుల సంజీవ్ (శ్యామ్), పందుల సమ్మయ్య విందుకు హాజరయ్యారు. అక్కడే ఉన్న గంగు మరిది కొడుకు నెన్నల శివశంకర్‌ను సంజీవ్, సమ్మయ్య పక్కకు తీసుకెళ్లి తమ మేనకోడలు కనిపించడం లేదని, పాతర్ల కార్తీక్ ఎటు పారిపోయారని కొట్టారు. శివశంకర్‌ను ఎందుకు కొడుతున్నారని ప్రశ్నించినందుకు మద్యంమత్తులో ఉన్న సంజీవ్, సమ్మయ్యలు కోడి పందేలలో వినియోగించే కత్తులతో పెళ్లి కుమారుడు కిరణ్‌తోపాటు బంధువులపై దాడి చేశారు. కడుపులో, చేతులపై, వెనుకభాగాల్లో గాయాలయ్యాయి. దాడిలో కిరణ్‌తోపాటు నెన్నల విజయ్(బాలు), చింతకింది చరణ్, సుంకరి సింధు, సుధీర్, తుమ్మ చంద్రశేఖర్ గాయపడ్డారు. వీరిలో బాలు, చరణ్, సుధీర్, చంద్రశేఖర్‌లకు తీవ్ర గాయాలు కాగా మంచిర్యాల ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఇద్దరు నిందితులను పట్టుకున్నామని ఏసీపీ తెలిపారు. వారి నుంచి కోడి పందేలలో ఉపయోగించే రెండు కత్తులు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో సీఐ రవీందర్ పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ వెంకటేశ్వర్‌రావు


గాయపడిన పెళ్లికొడుకు


చికిత్స పొందుతున్న నెన్నల బాలు

'మేషన్ కార్మికులకు వేతనాలు చెల్లించాలి'

శ్రీరాంపూర్(మంచిర్యాల): శ్రీరాంపూర్ డివిజన్‌లో పనిచేస్తున్న మేషన్, చిప్పింగ్ కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు చెల్లించాలని సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్ డిమాండ్ చేశారు. సోమవారం కార్మికులను కలిసి మాట్లాడారు. సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు అరకొర వేతనాలు ఇస్తున్నారని, అవి కూడా సక్రమంగా రావడం లేదన్నారు. ప్రతీనెల 10వ తేదీలోగా వేతనాలు చెల్లించాలన్నారు. దీనిపై యాజమాన్యం సర్క్యులర్ జారీ చేసినప్పటికీ కాంట్రాక్టర్లు అమలు చేయడం లేదన్నారు. యూనియన్ బ్రాంచ్ అధ్యక్షుడు రవీందర్, నాయకులు శ్రీనివాస్. సాయి కుమార్, కృష్ణ, తిరుపతి, మనోజ్ పాల్గొన్నారు.

నిలిచిన 'భవిత' డిగ్రీ ఫలితాలు

- ఆందోళనలో విద్యార్థులు
- కేయూ సెమిస్టర్ ఫలితాలు విడుదల

బెల్లంపల్లి: కాకతీయ యూనివర్సిటీ(కేయూ) సెమిస్టర్ ఫలితాలు విడుదల చేసినా బెల్లంపల్లి భవిత డిగ్రీ కళాశాల విద్యార్థుల ఫలితాలను హోల్డ్‌లో ఉంచింది. దీంతో పరీక్ష రాసిన విద్యార్థుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. మూడు రోజుల క్రితం డిగ్రీ విద్యార్థుల సెమిస్టర్ ఫలితాలు విడుదల కాగా ఇతర ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కళాశాలల విద్యార్థుల ఫలితాలు బహిర్గతం అయ్యాయి. డిగ్రీ మొదటి సంవత్సరం విద్యార్థుల ఫస్ట్ సెమిస్టర్, ద్వితీయ సంవత్సరం విద్యార్థుల థర్డ్ సెమిస్టర్, తృతీయ సంవత్సరం విద్యార్థుల ఫిఫ్త్ సెమిస్టర్ ఫలితాలు ప్రకటించారు. కళాశాలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థులు దాదాపు 300 మంది వరకు ఉన్నారు. యాజమాన్యం యూనివర్సిటీ డెవలప్‌మెంట్ ఫండ్(యూడీఎఫ్) చెల్లించకపోవడంతో ఫలితాలు ప్రకటించకుండా ఆంక్షలు విధించినట్లు తెలుస్తోంది. కాగా, ఫండ్ చెల్లించే ఏర్పాట్లలో యాజమాన్యం ఉందని, మూడో రోజుల్లో ఫలితాలను కేయూ ప్రకటిస్తుందని భవిత డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రాజేందర్‌రెడ్డి తెలిపారు.

నిందితులను అరెస్టు చేయాలని ధర్నా

- పోలీస్ స్టేషన్ ఎదుట పురుగుల మందు డబ్బాతో బైఠాయింపు

జన్నారం: తమ కుమారుడి ఆత్మహత్యకు కారకులైన నిందితులను అరెస్టు చేయకపోవడాన్ని నిరసిస్తూ మృతుని తల్లి తోకల సరస్వతి, సోదరుడు విశేష్, కుటుంబ సభ్యులు సోమవారం పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నాకు దిగారు. కడెం నీటి పారుదల శాఖలో జూనియర్ టెక్నికల్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న తోకల రాకేశ్ తన తండ్రి చనిపోయాడని, సెలవు కావాలని అడిగితే అదే కార్యాలయంలో పనిచేస్తున్న ఇద్దరు వ్యక్తులు వేధింపులకు గురిచేశారు. దీంతో మనస్తాపానికి గురై గత నెల 15 న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చనిపోయే ముందు తన మృతికి కార్యాలయంలో పని చేస్తున్న సూపరింటెండెంట్ ప్రభాకర్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ వేధింపులే కారణమని మరణ వాంగ్మూలం ఇచ్చాడు. ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. 22 రోజులు కావస్తున్నా ఇప్పటికీ నిందితులను అరెస్టు చేయకపోవడంతో బాధిత కుటుంబ సభ్యులు పురుగుల మందు డబ్బాతో సోమవారం పోలీస్ స్టేషన్ ఎదుట బైఠాయించారు. బీఆర్ఎస్, సీపీఐ, ఇతర నాయకులు వారికి మద్దతు తెలిపారు. సీఐ నరేందర్‌తో మాట్లాడి రెండు రోజుల్లో నిందితులను అరెస్టు చేస్తామని లక్సెట్టిపేట ఎస్సై చంద్రకుమార్, దండేపల్లి ఎస్సై స్వరూప్‌రాజ్ వారికి హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.


బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎస్సై చంద్రకుమార్